క్లుప్తంగా

లైబ్రేరియన్ నియామకం

మదనపల్లె సిటీ : ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా ప్రముఖ రచయిత రామ్మోహన్ నాయుడును నియమించినట్లు మదనపల్లె రచయితల సంఘం కార్యదర్శి లింగాల యుగంధరాచారి తెలిపారు. గతంలో పురాణం త్యాగమూర్తిశర్మ లైబ్రేరియన్‌గా బాధ్యతలు నిర్వహించారని, ఆయన మృతి చెందడంతో రామ్మోహన్‌నాయుడును నియమించినట్లు తెలిపారు.

దారి ఆక్రమణ



కాలనీకి వెళ్లే దారిలో పెన్సింగ్ ఏర్పాటు చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

పీలేరు : మండలంలోని బోదుమల్లువారిపల్లె పంచాయతీ హౌసింగ్ కాలనీ దారిని కొందరు ఆక్రమించి పెన్సింగ్ ఏర్పాటు చేసిన సంఘటన వెలుగు చూసింది. సర్వే నంబరు 932/2లో తమ భూమికి ఆనుకుని ఉన్న గుట్టను చదును చేసి ఆక్రమణకు పాల్పడడంతో పాటు కాలనీకి వెళ్లే దారిని కూడా ఆక్రమించి పెన్సింగ్ వేశారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆక్రమణకు గురైన చెరువుల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన చెరువులను రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఆదివారం సర్వే నిర్వహించారు. చెరువులు ఆక్రమణకు గురైనట్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీంతో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఆదేశాలతో జీవన చెరువులో సర్వే నంబరు 30లో 27.17 ఎకరాలు, ఒడ్డు కుంట 1.14 ఎకరాలు విస్తీర్ణాన్ని సర్వే చేసి నివేదిక తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు, మండల సర్వేయర్ హరికృష్ణ, వీఆర్వో యర్రయ్య, విలేజ్ సర్వేయర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో మండల పరిపాలన అధికారి మృతి



రమణ (ఫైల్)

రామసముద్రం : రామసముద్రం మండల ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న బి.రమణ (58) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చిన ఆయన ఇంట్లో కుప్పకూలి పడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలించేలోపు ఆయన మృతి చెందారు. కాగా కరోనా సమయంలో అతని భార్య, కుమారుడు మృతి చెందారు. ఆయన మృతిపై ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడి ఎన్నిక

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గ బీఎస్పీ (బహుజన్ సమాజ్ పార్టీ) ఉపాధ్యక్షుడిగా మద్దినాయునిపల్లెకు చెందిన ఎం. నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు సోముశేఖర్, ఇన్‌చార్జి మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రకటించారు.

మండల సర్వేయర్ బదిలీ

మదనపల్లె : మండల సర్వేయర్ బి.వి.సుబ్రహ్మణ్యంను, అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఏపీ, మంగళగిరి, సర్వే సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీకేష్, బి.లత్కర్ మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యంను జిల్లా కేంద్రంలోని డీఎస్ఎల్‌డీ కార్యాలయానికి బదిలీచేస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

హిందూసంఘాల ర్యాలీ

గుర్రంకొండ : తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలను డిమాండ్‌చేస్తూ మండల కేంద్రంలో హిందూసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మధురామచంద్రుడుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు రామాంజులు, చింతిర్ల శ్రీనివాసులు, సుంకర విజయ్, మల్లికార్జున స్వామి. ఉప్పు శ్రీనివాసులు, మల్లయ్య, కిరణ్, భరత్, ప్రసాద్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..!



కొత్తపేట వీధిలో రోడ్డుపై ఏర్పడిన గుంత



మసీదు వీధిలో మరమ్మతుకు నోచుకోని రోడ్డు

- ప్రమాదాలకు నిలయాలుగా మారిన గోతులు
- వాహనరాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని పలు వీధుల్లో పంచాయతీ అధికారులు పైపులైన్ల కోసం పలు చోట్ల పెద్దగోతులు తవ్వారు. పనులు పూర్తి చేసినా గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వీధుల్లో నిత్యం వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ గోతులను అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గోతులమయంగా వీధులు

పట్టణంలోని కొత్తపేట ప్రాంతం పరిధిలోని ఎస్ఎల్‌టీవీధి, మసీదువీధి, కొత్తపేట సందు వీధుల్లో సీసీ రోడ్లు గోతులమయంగా మారాయి. శ్రీ పోలేరమ్మ వీధి దగ్గర రెండు పెద్ద గోతులు నెల రోజుల కింద తవ్వారు. అలాగే కోట దగ్గర తాగునీటి సరఫరా కోసం కొత్తపేట పైపులైన్‌ను రెండు భాగాలు విడదీసి గేట్‌వాల్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గోతులు తవ్వారు. ఇదే వీధిలో మూడు చోట్ల గోతులు తవ్వారు. అయితే పనులు పూర్తి చేసినా గోతులను పూడ్చలేదు. రోజుల తరబడి మరమ్మతు పనులు చేపట్టలేదు. ఇదే మార్గంలో నిత్యం వందలాది మంది విద్యార్థులు పాఠశాలలకు వెళుతుంటారు. నెల రోజులుగా ఈ గోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు గోతులు కనిపించక పలువురు ప్రమాదాలకు గురయ్యారు. కొత్తపేటలోని మరో వీధి మధ్యలో మూడు రహదారులు కలిసే చోట ఏడాది కిందట గేట్‌వాల్ కోసం పెద్ద గొయ్యి తవ్వారు. పనులు పూర్తి అయినా గొయ్యిని పూడ్చలేదు. అంతేకాకుండా స్థానిక కేఏ ఫంక్షన్ హాల్ పక్కనున్న వీధికి ప్రారంభంలో ఉన్న రోడ్డులో గేట్‌వాల్ కోసం తవ్వేశారు. గేట్‌వాల్ వద్ద లీకేజీల వలన నీరు విధుల్లో ప్రవహిస్తోంది. తాగునీరు కలుషితం కావడంతో పాటు నీరు గోతుల్లో నిలిచిపోడం వలన దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న సీసీరోడ్లు

పట్టణంలోని ఎస్ఎల్‌టీ వీది, మసీదువీధి, నబీకాలనీతో పాటు కొత్తపేట పరిసరాల్లో పలు వీధుల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రోడ్లు మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. గోతులు కారణంగా వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వీధుల్లో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వీధుల్లో గోతులతో పాటు కంకర మొత్తం తేలిపోయింది. దీంతో రోడ్లు మొత్తం శిథిలమైపోయాయి. శ్రీపోలేరమ్మవీధిలో గతంలో నిర్మించిన మురుగునీటి కాలువలు ధ్వంసమయ్యాయి. మురుగునీటి కాలువలు పూర్తిగా దెబ్బతిని రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది.

మరమ్మతులు చేస్తాం



పట్టణంలో కొత్తపేట, ఎస్ఎల్‌టీవీధి, శ్రీపోలేరమ్మ వీధుల్లో ఏర్పడ్డ గోతులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, గోతుల మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే పనులు చేపడతాం.

– విశ్వనాథ్, పంచాయతీ ఈఓ, గుర్రంకొండ

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



బేబీకిట్స్, పండ్లు పంపిణీ చేస్తున్న మానవత డివిజన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, దాతలు

మదనపల్లె : ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని మానవత సంస్థ మదనపల్లె డివిజన్ చైర్మన్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ హెచ్ఎం గోపాల్‌రెడ్డి, కుటుంబసభ్యులు స్వర్ణకుమారి, మహేష్‌కుమార్‌రెడ్డి, మన్విత సౌజన్యంతో ఆదివారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని మెటర్నరీ వార్డులోని తల్లులకు బేబీకిట్స్, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచిత వైకుంఠరథంతో పాటుగా ఫ్రీజర్‌బాక్స్‌లు ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మానవత సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణప్ప, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, ఎస్టీయూ పోకలమధుసూధన, డైరెక్టర్స్ నారాయణరెడ్డి, సుధాకరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బి.టి.నరసింహులు, సుధాకర్‌రెడ్డి, శంకరప్పనాయుడు, చలపతి, నాగేశ్వరరావు, రాధికాభాయి, జిల్లా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన చింతల



వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

కలకడ : నూతన వధూవరులను పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. ఆదివారం మండలంలోని కలకడ దేవళంపేటలో జనాబ్ స్యద్‌సాహెబ్ కుమార్తె నూర్-ఎ-చష్మిని కేవీపల్లె మండలం గర్నిమిట్ట గ్రామం, మిరియాలవాడ్లపల్లెకు చెందిన జనాబ్ షేక్‌అమీర్‌బాషా కుమారుడు జావిద్‌బాషా వివాహ వేడుక పాల్గొని వధూవరులను మాజీ ఎమ్మెల్యే ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కరీముల్లా, జిలానీ, కేఎస్ మస్తాన్, వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చక్రధర్, దినేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు కాపీలు చింపివేస్తున్న ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్

పీలేరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను, దళిత మెడికల్ ప్రొఫెసర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నియోజవర్గ ఉపాధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను, దళిత మెడికల్ ప్రొఫెసర్‌ను అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలని ఆదివారం పీలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు తిరస్కరించడంతో ఫిర్యాదు కాపీలు చింపి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు అంబేడ్కర్ బ్యానర్ తొలగించి అవమానించడంహేయమైన చర్య అని పేర్కొన్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యే నానాజీ, దళిత మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్‌పై దాడి చేసి దుర్భాషలాడారన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, సదాశివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట (మిన్నంరెడ్డిగారిపల్లె)లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 35 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 105 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, వలంటీర్లు షబ్బీర్, బాషా, తిరుపతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో స్వచ్ఛతా హి ర్యాలీ



బి.కొత్తకోటలో ర్యాలీలో చేస్తున్న అధికారులు తదితరులు

బి.కొత్తకోట : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బి.కొత్తకోటలో ర్యాలీ, మానవహారం నిర్వహించి స్థానికులకు అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక దిగువ బస్టాండ్ నుంచి జ్యోతిచౌక్ వరకు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బ్యానర్లతో ప్రదర్శన చేశారు. స్వచ్ఛత, పరిసరాల శుభ్రత, వ్యాధులపై చేపట్టాల్సిన చర్యలను తెలుపుతూ ప్రచారం చేశారు. జ్యోతిచౌక్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, ఏపీఓ మురళీ, మేనేజర్ రమాదేవి, వైద్య, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, వీఆర్‌ఓలు, వెలుగు సీసీలు, సంఘమిత్రలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కలికిరి : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని పల్లవోలు సమీపంలోని బాహుదానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించగా రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని తెలిపారు. బాహుదానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

ఒంటిమిట్ట(సిద్దవటం) : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆయన పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అంతేగాకుండా ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట మండలం, సిద్దవటం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

సుండుపల్లె : మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నిర్వహించగా ఇద్దరు వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపుతుండటంతో కేసునమోదు చేశామని ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ప్రమాదాలు జరిగితే కుటుంబ సభ్యులు అనాథులుగా మిగులుతారనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్‌తోపాటు లైసెన్సు, ఆర్‌సీ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.

కల్యాణం.. కమనీయం



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి సమూహ ఆలయంలో కృత్తికా నక్షత్రంను పురస్కరించుకొని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురళీమోహన్, వసంతమ్మ, పద్మ, కోమల, రాధమ్మ, శశికళ, వెంకటేష్ బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



శ్రీరెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. తడిబట్టలతో అమ్మవారి ముందు సంతానం కోసం మహిళలు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. తమిళనాడు, కర్ణాటకతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఆత్మీయ సమ్మేళనం



1987-1988లో పదోతరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థులు

రామసముద్రం : చిన్ననాటి నుంచి ఒకే తరగతిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రామసముద్రం మండలంలోని జెడ్పీహైస్కూల్ 1987-1988లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 36 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుని, రోజంతా ఉల్లాసంగా గడిపారు.

సమస్యల వెల్లువ

కలికిరి : కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైన సందర్భంగా చంద్రబాబు ఆదేశాలతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం కలికిరి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డికి పలురకాల సమస్యలపై ప్రజలు వినతిపత్రాలిచ్చారు. ఇందిరమ్మకాలనీ, బీ.డీ. కాలనీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొందని, వెంటనే పరిష్కరించాలని మహిళలు కోరారు. బండకాడపల్లి, ప్రసాద్ థియేటర్ వెనుక ఏరియాలో మురుగునీటి కాలువలు లేక డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతోందని, కాలువలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. సాయంత్రం గుట్టపాళెంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ పలు సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు.

ప్రజాభిప్రాయ సేకరణ

మదనపల్లె : స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. ఆదివారం 2047 విజన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు గ్రామ పంచాయతీ స్థాయిల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ కరపత్రాల పంపిణీతో పాటుగా 100 రోజుల పాలనపై ప్రజలకు వివరించామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047కు సంబంధించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజల నుంచి సర్వే ద్వారా ప్రజాభిప్రాయసేకరణ చేశామన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సంబేపల్లె: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపి విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని భీజాక్షారాలు ఉన్న మహిమగల రాయిపై పొర్లుదండాలు పెట్టారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసిన శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొక్కులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయానికి విరాళం అందజేత

పుల్లంపేట : రెడ్డిపల్లి హరిజనవాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయానికి ఆదివారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువనాయకుడు రొంపిచెర్ల లక్ష్మీనారాయణ, ఆయన సతీమణి అనిత ఆదివారం మాతమ్మతల్లి ఆలయానికి రూ. 20 వేలు అందించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కుక్కలు బాబోయ్..!





బి.కొత్తకోట మెయిన్‌రోడ్డులో కుక్కల గుంపు

బి.కొత్తకోట : పట్టణంలో గ్రామ సింహాలు యథేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న వాటి సంతతిని చూసి వారు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపతున్నారు. పట్టణంలో చికెన్, మటన్ సెంటర్లు, హోటళ్ల సంఖ్య పెరిగి పుష్కళంగా ఆహారం దొరుకు తుండడంతో వీధి కుక్కల సంఖ్య కూడా ఇటీవల విపరీతంగా పెరిగింది. దాదాపు గొర్రెల మందల్లా అవి పట్టణం లోని అన్ని ప్రధాన రోడ్లలో కనిపిస్తున్నాయి. సాధారణంగా మనుషులు చూస్తే దూరంగా పారిపోయే పరిస్థితి పోయి మనుషుల పైకి, వాహనాలపైకి అవి ఎగబడుతున్నాయి. దీంతో అటు పాదాచారులు, ఇటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో పిల్లల్ని ఒంటరిగా పంపాలంటే భయంగా ఉంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

సూర్య బింబం.. సువర్ణ శోభితం

సూర్యాస్తమయం సమయాన ఆకాశం పసిడి వర్ణంలో మెరిసింది. పొద్దుపొడుపు సమయంలో చీకట్లు అలుముకుంటుండగా, ఆకాశంలో మబ్బులు పసిడి రంగులో మిళితమై కనిపించాయి. అందమైన ప్రకృతిని గీసినట్లుగా కాంతులు మురిపించాయి. సూర్యుని ప్రతిబింబం చెరువులో పడి చూపరులను అబ్బుర పరిచింది. ప్రకృతి సౌందర్యం కనువిందు చేసిన దృశ్యం మదనపల్లె సమీపంలోని బసినికొండ చెరువు వద్ద సూర్యాస్తమయం సమయంలో కనిపించింది.

– మదనపల్లె సిటీ

